వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 06 ఫిబ్రవరి 2025





## కరెంట్ షాక్‌తో చిరుత మృతి

### గుట్టు చప్పుడు కాకుండా గుట్టల్లో పూడ్చిన రైతు

పులివెందుల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :



కడప జిల్లాలో చిరుత పులి మృతి కలకలం రేపింది. జిల్లాలోని సింహాద్రి పురం మండలం బలపనూరు బి.కొత్త పల్లి వద్ద పొలానికి అమర్చిన కరెంటు వైర్లు తగిలిచిరుతపులి చనిపోయింది. స్థానికంగా ఉన్న రైతు భరత్ పొలంలో అమర్చిన కరెంట్ వైర్లు తగిలి 5 రోజుల క్రితం చిరుత పులి చనిపోవ డంతో సంబంధిత రైతు గుట్టుచప్పుడు కాకుండా లింగాల మండలం రామా పురం గుట్టల్లో చనిపోయిన చిరుత పులిని పూడ్చి పెట్టాడు. ఈ విషయం తెలిసిన ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసులు సిబ్బందితో కలిసి బుధవారం మధ్యాహ్నం చిరుత కళేబరాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి5 ప్రభాతవార్త



రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని బుధవారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తాడిపత్రి కి చెందిన అఖిల (21) అన్నమాచార్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చివరి సంవత్సరం చదువుతోంది . స్థానిక లక్ష్మీస్ హాస్టల్ లో అఖిల ఉంటుంది.కాలేజీ నుంచి వచ్చిన తర్వాత రూమ్ లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఆ సమయంలో సహచరి మిత్రులు ఎవరు లేరని తెలిసింది. రూమ్ లోని మిగతా స్నేహితులు వచ్చిన తర్వాత ఈ విషయం బయటపడింది. అఖిల తల్లిదండ్రులు తాడిపత్రి నుంచి హాస్టల్ వద్దకు చేరుకున్నారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బెల్ట్ లూస్... విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

## మామూళ్ల మత్తులో ఎక్సైజ్,పోలీస్ శాఖలు.

రైల్వేకోడూరు, అర్బన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త.



రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులపై బిగించిన బెల్ట్ లూజ్ అయింది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయి. ఏ సమయంలో చూసినా మద్యం విచ్చలవిడిగా బాటిల్లపై ఉన్న రేట్ల కంటే అధిక రేట్లకు చిన్నచిన్న కూల్ డ్రింక్ షాపులు మొదలుకొని పెద్దపెద్ద హోటల్ ల వరకు బెల్ట్ షాపులు పెట్టి అన్ని రకాల మద్యాలను విక్రయిస్తున్నారు. వీటి పట్ల చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, పోలీస్ శాఖలు మద్యం మత్తులోనూ, మామూళ్ల మత్తులోనూ జోగుతున్నట్లు తెలుస్తుంది. రైల్వే కోడూరు మండలంలో ప్రభుత్వ అనుమతి పొందిన 11 మద్యం షాపులు ఉన్నాయి. అయితే మద్యం యజమానులు మండలంలోని 22 పంచాయితీల్లో పట్టణాలు మొదలుకొని మారుమూల పల్లెల వరకు మద్యం బాటిల్లను సరఫరా చేసి, బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి పట్టపగలే విక్రయించడం దారుణంగా ఉంది. గత నెల గణతంత్ర దినోత్సవం రోజుకుడా మద్యం దుకాణాలు ముందువైపు చట్ట ప్రకారం సీజులు చేసి వెనుక వైపు వాకిళ్లు తెరిచి యదేచ్ఛగా విక్రయించడం జరిగింది. మరీ పల్లెల్లో అయితే ప్రతి బంకులోను బెల్ట్ షాపుల రూపంలో మద్యం విక్రయాలు అధిక రేట్లకు బాగానే వెక్కిరిస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లా ఎస్పీ ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, అక్రమంగా విక్రయిస్తున్న బెల్టు షాపులను పసిగట్టి ప్రతిరోజు కొన్ని మేర కేసులు కూడా నమోదు చేయాలని రాష్ట్ర ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు కఠినమైన ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలిసింది. అయితే అడపా దడపా పై అధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తున్నారే తప్ప బెల్ట్ షాపుల విక్రయాలను అరిక ట్టడంలో ఇటు ఎక్సైజ్ శాఖ, అటు పోలీసు శాఖ విఫలమైందన్నట్లే మండలంలోని పలు ప్రాంతాల ప్రజలు చర్చించుకోవడం విశేషం. బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే ఐదు లక్షలు జరిమానా, కఠిన శిక్షలు ఉంటాయని ప్రభుత్వం కఠినమైన ఆదేశాలు ఇచ్చి అలాంటివి ఎక్కడైనా ఒకటికి రెండుసార్లు పట్టుబడితే సంబంధిత మద్యం షాపు లైసెన్సునే రద్దు చేయడం కూడా జరుగుతుందని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అయితే వీటి పట్ల కఠినంగా వ్యవహరించి బెల్ట్ షాపులు రద్దు చేసి గ్రామాలలో శాంతిని నెలకొల్పాల్సిన సారా పోలీసులు మద్యం మత్తులో జోగుతుంటే, సివిల్ పోలీసులు బెల్ట్ షాపులకు అండగా నిలిచి, మామూళ్ల దండుకుని యదేచ్ఛగా విక్రయించేందుకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు కూడా మండలంలో అధికంగా వినబడుతున్నాయి. మద్యం దుకాణాల యజమానులు ఇరు పోలీసులతో మామూళ్ల రూపంలో చేతులు కలిపి మద్యం షాపుల పక్కనే యదేచ్ఛగా పట్టపగలే గుడారాలు వేసి, అన్ని వసతులు కల్పించి మద్యం ప్రియులకు మద్యం సేవించేందుకు అనుకూల ప్రదేశాలను కూడా బహిరంగంగానే ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తుంది. వీరి చర్యలు నామమాత్రంగా ఉండడంతోనే ఇటీవల గత కొంతకాలం నుంచి కొంతమంది ప్రాణాంతకమైన స్పిరిట్ తో అన్ని రకాల మద్యలను తయారుచేసి ప్రభుత్వం మద్యం బాటిల్ లకు అతి కించే స్టిక్కర్లనే బోగస్ స్టిక్కర్లుగా తయారు చేసి నకిలీ మద్యాన్ని విక్రయించినట్లు కూడా తెలిసింది. గత రెండు మూడు రోజుల క్రితం ఇలా తయారు చేసే నకిలీ మద్యం విక్రయదారులను కోడూరు, ఓబులవా రిపల్లి మండలానికి చెందిన ఐదు మందిని అదుపులోకి తీసుకోవడం కూడా జరిగింది. ఈ విక్రయిదారులు ఇంకా కొంతమంది పరారీలో ఉన్నట్లు కూడా పోలీసులు అనుమానించి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై కోడూరు ఎక్సైజ్ శాఖ సిఐ తులసిని వివరణ కోరగా బెల్ట్ షాపులపై ప్రత్యేక నిగా పెట్టడం జరిగిందని, వాటిని అదుపు చేసేందుకు ముమ్మరంగా దాడులు జరుపుతున్నామని, గత నెల గణతంత్ర దినోత్సవం రోజు కూడా నియోజకవర్గం నుంచి 21 కేసులు నమోదు చేసి బెల్ట్ షాపులు విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది అని తెలిపారు..

# రేషన్ గోదాము తనిఖీ

వేంపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :



మండల కేంద్రమైన వేంపల్లెలోని రేషన్ గోదామును జిల్లా జాయింట్ కలెక్టర్ అతిది సింగ్ తనిఖీ చేశారు. బుధవారం వేంపల్లి లో తహసీల్దార్ హరినాధ్ రెడ్డి, సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ లతో కలిసి పలు రికార్డులను ఆమె పరిశీలించారు. అలాగే సంబంధిత వివరాలను గోదాముల డీటీ శివప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పౌరసరఫరాలకు సంబంధించి నిర్లక్ష్యం వహించకుండా లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం చింతలమడుగుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, ప్రభుత్వం ద్వారా అందుతున్న బియ్యం సక్రమంగా సరఫరా అవుతున్నాయా అని హెచ్ఎం ని అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల సర్వతో ముఖాభివృద్ధే ధ్యేయం

### టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు



రాజంపేట అర్బన్,ఫిబ్రవరి5 ప్రభాతవార్త

గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం బోయిన పల్లెలో సిసి రోడ్లకు భూమి పూజ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు.గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.గత వైకాపా ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేసి ప్రజలను అధోగతిపాలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. రాజంపేట నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు,పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, బిజెపి పార్లమెంట్ యువ నాయకులు చమర్తి మహేష్ రాజు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్,టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు గొట్టుముక్కల పెంచలరావు, పార్లమెంట్ బిసి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి భోగా మురళి,గొట్టుముక్కల పెంచల నరసింహారావు, సుబ్బరాయుడు,మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు,తెలుగు యువత అధికార ప్రతినిధి జగదాభి పాండురాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, పట్టణ యువ నాయకుడు తేజాల ఆనంద్,శ్రీను, మునియా, బిట్ట వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకుల సుబ్బరాజు, తులసి నాగేంద్ర, నందన్ పెంచలయ్య, గౌడ కోదం డ,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ (ఎ1) సాంకేతిక ఆధారంగా నిఘా వ్యవస్థ పటిష్టపరిచే దిశగా ఎస్పీ

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)

అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ప్రస్తుత ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ (ఎ1) సాంకేతిక ఆధారంగా జిల్లాలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, శాంతి భ ద్రతలకు నిఘా వ్యవస్థను పటిష్టపరిచే దిశగా అడుగులు ముందుకేస్తున్నారు. తద్వారా నేరాలు అదుపు చేసే చర్యలకు ఉపక్రమించారు. ఎ1 సాంకేతికతను శాంతి భద్రతల పరిరక్షణలో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చన్న అంశాలపై జిల్లా ఎస్పీ జిల్లాలోని అదనపు ఎస్పీతో పాటు, స్పెషల్ బ్రాంచ్, సోషియల్ మీడియా, సైబర్ క్రైమ్ రిజర్వ్, డిసిఆర్బీ, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్,కమ్యునికేషన్, ఐటి కోర్ టీమ్ తదితర పోలీసు అధికారులతో క్షుణ్ణంగా సమీక్షలు జరుపుతున్నారు. ముందుగా జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడమే కాకుండా వివిధ సీసీ కెమెరాల కంపెనీలతో ప్రజల భద్రతకే ప్రధమ ప్రాధాన్యత ఉండే విధంగా ఎ1 సాంకేతికత ఆధారంగా ఏర్పాటు చేసే సీసీ కెమెరాల ప్రాజెక్టు అమలు, పురోగతి, ప్రణాళిక, భవిష్యత్తు తదితర సదుపాయాలను సమీక్షించి ఒప్పందాలు చేసుకునేందుకు పోలీసు అధికారులతో సమీక్ష కూడా ఎస్పీ చేస్తున్నారు. జిల్లాలోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ముఖ్యమైన కూడళ్లు, పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు హైవేలు, విద్యా సంస్థలు, ప్రార్ధనా మందిరాలు తదితర ముఖ్యమైన ప్రాంతాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా చాలా వరకు శాంతా భద్రతలను పర్యవేక్షించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగానికి సుళువవుతుంది. ఇలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పర్యవేక్షించే విధంగా చర్యలు పోలీసుశాఖ చర్యలు తీసుకోనుందని తెలుస్తోంది. ముఖ్యంగా సీసీ కెమెరాల ఏర్పాటు యొక్క వేగం, నాణ్యతను మెరుగుపరచడం, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ సామర్ధ్యాన్ని పెంచడం, ఎ1 సాంకేతికతను సమర్ధవంతంగా ఉపయోగించడం తదితర అంశాలతో పాటు వివిధ వర్గాల ప్రజల నుండి ఇందుకు సంబంధించి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవడం ద్వారా జిల్లాలో శాంతి భద్రతల విషయంలో ఒక ముఖ్యమైన అడుగు అవుతుందన్న అభిప్రాయాన్ని పోలీసు అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ అభిప్రాయం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఎ1 సాంకేతికతను పోలీసు శాఖ సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా ఆయా ప్రాంతాల్లో జరిగే చట్ట వ్యతిరేక చర్యలను స్థానికుల ద్వారా పోలీసులకు సకాలంలో సమాచారం అందుకోవచ్చని, సోషియల్ మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చేయవచ్చని జిల్లా ఎస్పీ భావిస్తున్నారు. ఇప్పటికే వివిధ రకాల నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, పోలీసు సమాచారం కోసం వాట్సప్ ఛానల్‌ను జిల్లా పోలీసు యంత్రాంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా బుధవారం జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ముఖ్యమైన సూచనలు, సలహాలు ఇస్తూ సోషియల్ మీడియా ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారుంపై చాటింగ్ చేయవద్దని, తెలియని వ్యక్తుల నుండి వచ్చే సందేశాల లింక్‌లపై క్లిక్ చేయవద్దని, తప్పుడు సమాచారం, పుకార్లను వ్యాప్తి చేయవద్దని, రోడ్డు భద్రత, మహిళల భద్రత, బాల్య వివాహాలు, గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు, క్రికెట్ బెట్టింగ్, సైబర్ క్రైమ్, వైట్ కాలర్ నేరాలు, ఆర్థిక నేరాలుకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేసే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. అలాగే పోలీసు వాట్సప్ ఛానల్ జిల్లాలోని అన్ని వర్గాల్లో ప్రతి ఒక్కరూ ఉపయోగించేలా యజ్ఞంలా, ఒక టాస్క్‌గా భావించి జిల్లాలోని పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పిలుపిస్తున్నారు.



## వైయస్ వివేకా కేసులో కీలక మలుపు

### అప్రూవర్ దస్తగిరి ఫిర్యాదు

### చైతన్య రెడ్డి, డీఎస్పీ లతో సహా నలుగురిపై కేసు నమోదు



పులివెందుల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. వివేకా కేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరి ఫిర్యాదు మేరకు దేవిరెడ్డి చైతన్య రెడ్డి, డీఎస్పీ నాగరాజు లతో సహా నలుగురి పై జీరో ఎఫ్ ఐ ఆర్ ను ఈనెల 3వ తేదీన పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్టు పులివెందుల పోలీసులు తెలిపారు. 341 , 506 , 323 ,195 (ఏ) , 330 ఐ /డబ్ల్యూ, 109 ఐపీసీ సెక్షన్ల, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవి రెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి , ఏ 2 గా జమ్మలమడుగులో పనిచేసిన డి.ఎస్.పి నాగరాజు, ఏ 3 గా ఎర్రగుంట్ల సీఐ గా పనిచేసిన ఈశ్వరయ్య, ఏ4 గా కడప జైల్ సూపరింటెండెంట్ గా పనిచేసిన ప్రకాష్ ఉన్నారు. 2023 అక్టోబర్ లో దస్తగిరి బంధువుల అమ్మాయి ప్రేమ వివాహ విషయంలో దస్తగిరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో దస్తగిరిని ఏడు రోజులపాటు చీకటి గదిలో ఉంచి పోలీసులు చితకబాదినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ కేసులో 2023 అక్టోబర్ నుంచి ఫిబ్రవరి 2024 వరకు కడప జైలులో దస్త గిరి రిమాండ్ ఖైదీగా ఉన్నప్పుడు వివేకా కేసులో వైకాపా నేతలకు మద్దతుగా మాట్లాడాలని డీఎస్పీ నాగరాజు బెదిరించాడు అని అలాగే వివేకా కేసులో నవంబర్ 2023లో కడప సబ్ జైలుకు వచ్చి సిబిఐ ఎస్పి రామసింగ్ కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి బెదిరించాడని సాక్ష్యం చెప్పినందుకు గాను రూ.20 కోట్లు ఇస్తామని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరితో పాటు జైలు సూపరింటెండెంట్ గా పని చేసిన ప్రకాష్ సబ్ జైలులో వున్నన్ని రోజులు ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై గతంలో పిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు అని దస్తగిరి మరొక మారు ఫిబ్రవరి 3వ తేదీన ఫిర్యాదు చేయడంతో పోలీసులు జీరో ఎఫ్ ఐ ఆర్ కింద కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

## ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటా

పులివెందుల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :



పట్టణంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తన స్వగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ లో పులివెందుల నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడికి వచ్చినటువంటి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలు వారి సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యను వినతి రూపంలో తీసుకున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆ వినితులను చదువుతూ వారి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులతో ఫోన్ లో మాట్లాడుతూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్కడికి వచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూడా ఆయా గ్రామాలలో వారికి ఉన్నటువంటి సమస్యలను గురించి పూర్తిగా ఎమ్మె ల్సీ రాంగోపాల్ రెడ్డి కి వివరించగా ఆయన వారి సమస్యలను పరిష్కరిస్తానని తప్పకుండా ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు వంగల శశిభూషణ్ రెడ్డి పాల్గొని భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డితో వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

### దీర్ఘకాలంగా పరిష్కారం కాని కేసులు, విచారణకు నోచుకోని కేసులపై

## ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలి



కడప ఫిబ్రవరి 5: ప్రభాతవార్త

జిల్లాలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని, విచారణకు నోచుకోని కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాలులో సి.ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ సంబంధిత కేసులపై వారానికోసారి వ్యక్తిగతంగా తాను పరిశీలించడం జరుగుతుందన్నారు. కేసుల పురోగతిని నివేదికల ద్వారా తెలుసుకుంటామన్నారు. పోలీసు వృత్తిపట్ల నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని జిల్లా ఎస్.పి పోలీసు అధికారులకు సూచించారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో అందరూ ప్రజలకు జవాబుదారీగా ఉంటూ చట్ట పరిధిలో విధులు నిర్వహించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్)లో వచ్చే ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్ నేరాల కట్టడికి విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రభావవంతంగా విధులు నిర్వర్తించే ఖివిజిబుల్ పోలీసింగ్ఖి పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లాలోని సి.ఐ లు పాల్గొన్నారు.



### జాతీయ జంబోరి వేడుకలలో

## జిల్లా స్కౌట్ విద్యార్థుల ప్రతిభ

### అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్.

సంబేపల్లి ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

తమిళనాడులోని తిరుచురాపల్లిలో జనవరి 28వ తేదీ నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకలలో పాల్గొని ప్రతిభ చూపిన అన్నమయ్య జిల్లా స్కౌట్ విద్యార్థులను బుధవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. జంబోరి వేడుకలలో ప్రతిభ చూపి ఎస్పీ ద్వారా అభినందనలు పొందిన వారిలో సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తరుణ్ కుమార్ గౌడ్, వీర వెంకట ప్రణీత్, నాగచైతన్య రెడ్డి, వెంకటేశ్వర, శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన విద్యార్థులు జాతీయ జంబోరి వేడుకలలో పాల్గొని ప్రతిభ చూపి జిల్లాకు పేరు తేవడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ నందు 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతీయ జంబోరి అనేది విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండే కాకుండా ఇతర దేశాల నుండి దాదాపు 25 వేల మంది హాజరయిన ఈ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ఫుడ్ ఎగ్జిబిషన్, మార్చ్ ఫాస్ట్, యోగ, క్యాంప్ ఫైర్ తదితర విభాగాల్లో మన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. అనంతరం జిల్లా డిఆర్ఓ మధుసూదన్ రావు, డీఈవో సుబ్రహ్మణ్యం, డివైఈవో శివ ప్రకాష్ రెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ నితిన్ రెడ్డి, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కొండూరు శ్రీనివాసరాజు, డిసిఈబి సెక్రటరీ నాగ మునిరెడ్డి, ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్టెమీ పట్ల అవగాహన కలిగి ఉండాలి



**పీలేరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అములు చేస్తున్న స్టెమి పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని పీలేరు ప్రాంతీయ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పీలేరు ప్రాంతీయ వైద్యశాలలో మెడికల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా పెరుగుతున్న మరణాలకి ఒక ముఖ్య కారణమైన గుండె పోటుపై అహూహచ. కల్పించారు. ఛాతినొప్పి, ఎడమభుజం లాగడం, ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే గుండెపోటని అనుమానించి ఈ లక్షణాలు మొదలైన తరువాత అత్యంత కీలకమైన మొదటి గంటలోపు సామాజిక ఆరోగ్యకేంద్రం, ప్రాంతీయ వైద్యశాల, జిల్లా వైద్యశాలకు చేరుకోవాలని అన్నారు. అలాగే అక్కడ ఖరీదైన టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ ఉచితంగా పొంది ప్రాణాలు కాపాడుకోవాలని కోరారు. ఇలాంటి ఖరీదైన చికిత్స పీలేరు ప్రాంతీయ వైద్యశాలలో ఇప్పటివరకు 24 మంది పొంది, ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అలా చికిత్స పొందిన వారిలో 5 మంది రోగులు వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టెమినోడల్ ఆఫీసర్ ఎం. నాగవేణి, సిఆర్ఎంఒ కెవి సరస్వతమ్మ, పరిపాలన అధికారి ఎన్. భాస్కర్, ఆఫీస్ సూపరింటెండెంట్ శివప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్. షరీఫ్ జాన్, హెడ్ నర్స్ కె. శారద, ఫార్మసీ ఆఫీసర్ ఇందుమతి, స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న హౌసింగ్‌కాలనీలో రోడ్లను తనిఖీ



**రాజుపాళెం, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త.**
మండల పరిధిలోని పలుగ్రామాలలో జగనన్న హౌసింగ్‌కాలనీలలో వేసిన గ్రావెల్‌రోడ్లను బుదవారం తనిఖీ బృదం పరిశీలించి, రికార్డులలో నమోదు చేసిన కొలతలను సరిచూసి తనిఖీ చేశారు. ఈతనిఖీ బృదంలో హౌసింగ్ డిఇ రాజశేఖర్, ఏపిఒ లక్ష్మీనారాయణ, డిప్యూటి తాసిల్దార్ మనోహర్‌రెడ్డి, ఏఇ శేఖర్, సోషల్‌ఆడిట్ డిఆర్‌పి పెంచలయ్య, జె.ఇ. కరుణలు కలిసి వేసిన గ్రావెల్‌రోడ్లను తనిఖీ చేయటం అయినది. మండలంలోని రాజుపాళెం, వెలవలి, కొర్రపాడు, టంగుటూరు, గాదెగూడూరు, కూలూరు, వెంగళాయపల్లె, పర్లపాడు, చిన్నశెట్టిపల్లె గ్రామాలలో హౌసింగ్ కాలనీలలో వేసిన గ్రావెల్‌రోడ్లను తనిఖీ బృదం తనిఖీచేశారు ఈ తనిఖీ నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ ఓబన్న, టి.ఏ లు మాధవి, నాగార్జున, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నల్సా పథకాలపై న్యాయ సేవల సభ్యులకు సెన్సిటైజేషన్ ప్రోగ్రాం

**కడప లీగల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ కం జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫక్రుద్దీన్ నల్సా పథకాలైన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి మేథో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథ కం 2024లపై న్యాయ సేవల సభ్యులకు సెన్సిటైజేషన్ ప్రోగ్రాంను న్యాయ సేవాసదన్ కడప నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, సపోర్ట్ పర్సన్స్ గార్డియన్ మరియు వార్డ్ యాక్ట్, బాలల మరియు కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006 బాల్య న్యాయ చట్టం 2015 ఉచిత మరియు నిర్బంధ విద్య కోసం పిల్లల హక్కు చట్టం 2009 లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం 2012 పిల్లల కోసం జాతీయ విధానం 2013 మిషన్ వాత్సల్య పథకం 2022 మో డల్ పోస్టర్ కేర్ మార్గదర్శకాలు 2024 పథకం కింద చర్యలు, సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలకు న్యాయ సేవలు న్యాయ సేవలు ప్రదాతలు మరియు సంస్థల బాధ్యతలు మొదలగు వాటిని వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్‌లైన్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయం మొదలు అంశాను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లి ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ శ్రీకృష్ణ కిశోర్, జిల్లా వైద్యాధికారి డా.నాగరాజు, కడప మరియు ప్రొద్దుటూరు డిస్టిక్ ఎర్లీ ఇంటరెవన్షన్ సెంటర్ అధికారి రమేష్, ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్, కడప డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, న్యాయ సేవల సభ్యులైన ప్యానల్ న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

## సామాజిక కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

**కలికిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కేంద్ర టీం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్ర టీం బృందం డా.పర్వీన్ సుల్తానా కేంద్ర ప్రభుత్వం ద్వారా కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో అమలవుతున్న ఎన్‌సీడీ తల్లీ మరియు బిడ్డ సంరక్షణ కుటుంబ పథకం పలు పథకాలకు సంబంధించి ఆరా తీశారు. ఈ సందర్భంగా నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ యూనిట్నీ మానిటర్ చేసి బీపీ షుగర్ వ్యాధిగ్రస్థులకు అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. ఫిజియోథెరపీ యూనిట్ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డా.పవన్‌కుమార్ ఆసుపత్రిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు గురించి వివరించారు. కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి అత్యధిక సంఖ్యలో మారుమూల గ్రామాల నుంచి రోగులు వచ్చి కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని అలాగే కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.పవన్‌కుమార్, వైద్య బృందం అందిస్తున్న ఎసేవలపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో మేడంతో పాటు డీపీవో డా.వెంకటేష్, డా.ఆశాలత, డా.అన్వేష్, డా.ఇమ్రాన్, మురళీ, ఫిజియోథెరపిస్ట్, ఇన్‌ఛార్జి హెడ్ సిస్టర్ వనజ, మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పద్ధతి ప్రకారం వివరాలు అడిగితే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం : ఈఓ గురుమోహన్

**పీలేరు. ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:**
పీలేరు పంచాయతీకి సంబంధించి ఎటువంటి సమాచారం కావాలన్నా ఒక పద్ధతి రూపంలో సర్పంచిగా బాధ్యత వహించి వివరాలు అడిగితే ఎన్నిమార్లైన అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ తెలిపారు. ప్రజలకు పంచాయతీకి గౌరవాన్ని తెచ్చేవిధంగా బాధ్యతగా పంచాయతీ అభివద్ధికి దోహదపడేవిధంగా సర్పంచి కూడా సహకరించాలని ఆయన అన్నారు. బుధవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ గతంలో పంచాయతీకి సంబంధించిన వివరాలను 2111 2024వ తేదీ లెటర్ హెడ్లో 0106 2024 నుంచి 21 11 2024 వరకు పూర్తి సమాచారం వివరాలత కూడిన కార్యదర్శితో పాటు సిబ్బందితో కలిసి సుమారు 260 పేజీలతో కూడిన సమాచారాన్ని సర్పంచి ఇంటి వద్దనే అందజేశామని అలా సమాచారం ఇచ్చినా కూడా మళ్లీ పంచాయతీ వివరాలు అడగటం ఎంతవరకు సమంజసం ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గతంలో సర్పంచి అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారంతో వివరాలు వారిగా బహిర్గతంగా మీడియాకు కూడా తెలియజేసిన విషయం అందరికి తెలిసిందేనని, అలా ఇచ్చిన సమాచారాన్ని కూడా మనసులో ఒక్కటి పెట్టుకుని మరీమరీ సమాచారం ఇవ్వమని అడగడం సర్పంచి ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా మరోసారి కూడా



వివరాలు పద్ధతి ప్రకారం అడిగితే ఉన్నతాధికారుల ఆదేశాలతో నిబంధనలు మేరకు ఎటువంటి సమాచారాన్ని ఇవ్వడానికైనా మేము సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సర్పంచి పునరాలోచించి మేజరు పంచాయతీ అయిన పీలేరు పంచాయతీకి సహకరించాలని ఆయన కోరారు. గతంలో ఇచ్చిన సమాచారం పై సర్పంచికి తప్తి లేకుంటే మరోసారి అప్పీలుకు వెళ్లవచ్చునని ఎటువంటి అభ్యంతరాలు లేవని అదేవిధంగా 265 పేజీల సమాధానాల పై ఇన్ని రోజులు ఎందుకు ప్రశ్నించలేదని ఈఓ గురుమోహన్ కోరారు.

## రీ సర్వేని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**కలికిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
కలికిరి మేజర్ పంచాయతీ రెడ్డివారిపల్లె గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహేశ్వరీభాయ్ పేర్కొన్నారు. బుధవారం కలికిరి రెడ్డివారిపల్లె సచివాలయంలో రీ సర్వేపై గ్రామసభ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రీ సర్వేలో అధికారులు భూములకు సంబంధించి సర్వేపై, భూముల రికార్డులపై రైతులకు, ప్రజలకు తహసీల్దార్ అవగాహన కల్పించారు. రైతులు తమకు భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు సర్వే చేసేటప్పుడు అధికారులకు చూపించి రీ సర్వేలో తప్పులు జరగకుండా జాగ్రత్త పడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండల సర్వేయర్ రెడ్డప్ప, నాయకులు రెడ్డప్పరెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, వీఆర్వోలు శిల్పాకుమారి, గౌరి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## గంబుషియా చేపలు విడుదల



**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 5ప్రభాతవార్త:**
బద్వేల్, మరియూ, పోరుమామిళ్ల, సబ్ యూనిట్స్, పరిధిలో, సబ్ యూనిట్ ఆఫీసర్ , టి. నరసింహా రెడ్డి, పోరుమామిళ్ల, బద్వేల్ ప్రాంతాల యందు లో లైయింగ్ ఏరియాలల్లో, బి. మఠం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పరిధిలో, బొగ్గురువారిపల్లి, పలుగురాళ్ళపల్లి, హరిజనవాడ, మల్లే పల్లి, లింగాలదిన్నెపల్లి, అనంతరాజపురం, బద్వేల్ నాగులచెరువు, టేకూరుపేట పరిధిలో, మల్ల కతువ, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ హౌస్, దగ్గర, పోరుమామిళ్ల, నరసాపురం, మిద్దెల, హరిజన వాడ, యర్రసాల, మొదలగు గ్రామాల యందు బుధవారం గంబూషియా చేప పిల్లలను, దోమల యొక్క లార్వా యదగ కుండా, దోమలను అదుపు చేసేటందుకు ఉపయోగపడుతుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి కె.నాగరాజు, జిల్లా మలేరియా అధికారిణి, మనోరమ, ఆదేశాల మేరకు, జిల్లా అంతటా, అన్ని మండలాల్లో, అన్ని లో లైయింగ్ ప్రాంంతాల యందు, ఈ గంభూ జియా చేపలను విడుదల చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## నల్ల లేబర్ కోడ్ల్ ఎత్తివేయాలి: సిఐటియు




**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**
స్థానిక పోరుమామిళ్లలోని అంబేద్కర్ విగ్రహం ముందు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలోనాలుగు నల్ల లేబర్ కోడ్ల్ ఎత్తివేయాలని ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ .భైరవ ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలము నాటి 44 చట్టాలను దుర్మార్గంగా దుశ్యాసునుడిగా బిజెపి పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమిత్ షాలు నాలుగు కోడ్ లుగా మార్చి కార్మికుల పైన ఉక్కుపాది మోపడం సిఐటియు ఖండిస్తుందని వారన్నారు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించలేని ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని వారన్నారు. దేశవ్యాప్తంగా బడ్జెట్ కాపీలను దహనం చేశామని కార్మిక సంఘాలు రైతు సంఘాలు సిఐటియూ ఆధ్వర్యంలో నిరసనలు పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా చేపట్టడంలో భాగంగా పోరుమామిళ్లలో కూడా వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు చిన్నయ్య, రామయ్య బాలు, భాష, జమాల్ రైతు సంఘం నాయకులు దుర్గయ్య, హంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబులయ్య, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు గౌసియాభేగం, మహిళా మండల నాయకురాలు లూర్ధుమేరి బీబి, ఓబులమ్మ, మున్ని, లచ్చమ్మ, వెంకటలచ్చమ్మ, వెంకటసుబ్బమ్మ కెవిపిఎస్ మండల నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**రైల్వేకోడూరు ఫిబ్రవరి 5 ప్రభాత వార్త...**
నియోజకవర్గంలోని పుల్లంపేట ఎస్బి వి డి కళాశాల నందు ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ముక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముక్కారూపానంద రెడ్డి తనయుడు ముక్కా సాయి వి



కాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఎస్వీ అరవిందో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రతి ఒక్కరు కంటి చికిత్సలో చూపు లేని వారికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇందులో ఉచిత మందులతో పాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా చేస్తున్నామని అన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో కంటి జబ్బులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాల్గొన్న వారికి ఉచిత భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నామని సాయి వికాస్ రెడ్డి పేర్కొన్నారు.

## అభిమాని పాడి మోసిన మాజీ ఎమ్మెల్యే



**రైల్వే కోడూరు ఫిబ్రవరి 5 ప్రభాత వార్త**
మండలంలోని పందేటివారిపల్లె కు చెందిన వైసిపి నాయకుడు గుంటుమడుగు సుధాకర్ రాజు రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు హుటాహుటిన మృతుడి కుటుంబానికి వెళ్లి సుధాకర్ రాజు పార్టివదేహానికి నివాళులర్పించారు. ముఖ్యంగా సుధాకర్ రాజు ఎంతో భవిష్యత్తు ఉన్న నాయకుడని అర్ధాంతరంగా ఆయన మృతి జీర్ణించుకోలేకపోతున్నానని ఆయన ఆవేదన చెందారు. వైసిపి పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా ఉన్న సుధాకర్ రాజు మృతి చెందాడు, అంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని ఆయన కన్నీటి పర్యవంతమయ్యారు. అనంతరం ఆయన సుధాకర్ రాజు మృతదేహాన్ని పాడి ఎత్తుకుని మూసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ముప్పాల హేమన వర్మ, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోటి శివ సాయి, నాగేంద్ర యజ్ఞం చంద్రశేఖర్ ఆనాల కవిత చెంగల్ రెడ్డి, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, భూంపల్లి నాగరాజా రామాంజనేయులు కృష్ణారెడ్డి కరిముల్లా తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## ఘనంగా ఉరుసు ఉత్సవాలు

**వాల్మీకిపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
స్థానిక ప్రాచీన సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు మహోత్సవాలు ఈనెల 7వ తేది నుంచి 9వ తేది వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ఉరుసు కమిటీ అధ్యక్షులు సందాని బాషా బుధవారం తెలిపారు. ఈనెల 7వతేది శుక్రవారం గంధము, ముషాయిరా కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ఉరుసు మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి 8వతేది శనివారం ఉరుసు మహోత్సవం, ఖవ్వాలి తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే 9వతేది ఆదివారం తహ్లీ ఫాతెహా కార్యక్రమంతో దర్గా ఉరుసు మహోత్సవాలు ముగియనున్నాయి. ఉరుసు సందర్భంగా దర్గా ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. పెద్దఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు డా ఉరుసు మహోత్సవాలకు ప్రజాప్రతినిధులు బయటప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు రానున్న దృష్ట్యా స్థానిక ఎస్సై చంద్రశేఖర్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

## బ్రాహ్మణులకు పథకాల్లో లబ్ధి చేకూర్చండి



**వేంపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో బ్రాహ్మణులకు లబ్ధి చేకూర్చే పథకాలను అమలు చేయాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రావు కోరారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ను బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రావు బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందించారు. ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా బ్రాహ్మణులకు తక్కువగా లబ్ధి కలుగుతున్నదని, వారికి లబ్ధికలిగే పథకాలను పునఃప్రారంభించాలని గతంలో మాదిరిగా బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరించి ఆ పథకాలను తిరిగి అమలు చేయాలని కోరారు. తొలుత గరుడ పథకాన్ని వెంటనే అమలు చేసి ఎంతోమంది బ్రాహ్మణులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే దాదాపు 100 మంది పైగా బ్రాహ్మణులు గరుడ పథకానికి దరఖాస్తులు చేసుకుని ఉన్నారని అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాగే బ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించడానికి రాబోవు మండల జిల్లా కమిటీలలో బ్రాహ్మణులకు పార్టీ పరంగా పదవులు ఇవ్వాలని రాజకీయంగా బ్రాహ్మణులు ఎదిగే అవకాశం ఉంటుందని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటుకులపాటి భాస్కరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలకై ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలి

**రాయచోటి ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**
పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని డిఆర్ఓ మధుసూదన్ రావు సూచించారు. రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్ లోని పిసిఆర్ కళ్యాణ మండపం నందు బుధవారం ఉదయం పదవ తరగతి ఫలితాలపై ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రథమ స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రశ్నాపత్రాలపై ప్రతి విద్యార్థికి అవగాహన పెంచాలని, అలా పెంచినప్పుడే విద్యార్థి బాగా చదివి మంచి ఫలితాలను సాధిస్తారన్నారు. చదువులో వెనుకబడిన సి,డి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థులలో ఉన్న భయాన్ని, ఒత్తిడిని తొలగించడానికి ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి, డిసిఇబి సెక్రెటరీ నాగముని రెడ్డి, ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఐఈడి కోఆర్డినేటర్ జనార్ధన్, జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## అన్ని గ్రామాల అభివృద్ధియే కూటమి లక్ష్యం.



**చిట్వేలి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
అన్ని గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. బుధవారం తిమ్మాయపాలెం పంచాయతీ గట్టు మీద పల్లి గ్రామం నందు 15 లక్షల ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి తో కలిసి భూమి పూజ చేశారు. ఇల్లు, విద్యుత్తు, భూమి, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని కొందరు పేదలు విన్నవించగా సత్వరమే న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ప్రజలకు కనీసం మోలిక వసతులను కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చుతామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, మాదాసు నరసింహ, సర్పంచులు తుపాకుల బాలు, గుత్తి నరసింహ, గ్రామస్తులు సువారపు నాగేశ్వర రావు, పెద్ద బాలయ్య, సుబ్రహ్మణ్యం, హరి ప్రసాద్, రియాజ్, పెంచలయ్య, స్థానిక కూటమి నాయకులు, ,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**సిద్దవటం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర మొదటి మహాసభలు ఫిబ్రవరి 12, 13 తేదీల్లో కడప నగరంలో అన్ని ఐఎంఏ హాల్లో నిర్వహించనున్నట్లు ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా దగ్గరగా మీ మహిళా సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి (మాజీ ఎంఎల్ఏ) పూర్ణిమ బిశ్వాస్, జాతీయ కమిటీ సభ్యురాలు పీఎస్ఆర్ఎస్ ప్రవళికలు హాజరు కానున్నట్లు ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి మహిళా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కో కన్వీనర్ సుబ్బమ్మ, జిల్లా కన్వీనర్ అరుణకుమారి, హిమబిందులు పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరంలోని ఓం శాంతినగర్‌లో నెలకొని ఉన్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుబ్బమ్మ అరుణకుమారి, హిమబిందులు మాటల్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939లో ఈ దేశానికి సత్యాగ్రహాలతో నిరాహారదీక్షలతో స్వాతంత్ర్యం సిద్ధించదని, సాయుధ పోరాటంతో మాత్రమే దేశానికి స్వాతంత్ర్యం సిద్దిస్తుందని నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీ ఐఎన్ఏలో మహిళలకు స్థానం కల్పించడం జరిగిందన్నారు.

## జెస్సికి మండల శాఖ వారు వితరణ



**బ్రహ్మంగారి మఠం: ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:**
ఇటీవల కాలంలో జాతీయస్థాయిలో జంప్ రోప్ క్రీడల నందు బంగారు పతకాన్ని సాధించిన గోవిందమాంబ బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మట్లిలో మాణిక్యం చిత్రాల జెస్సికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ బ్రహ్మంగారిమఠం మండల శాఖ వారు అమ్మాయికి అంతర్జాతీయస్థాయిలో జపాన్ నందు జరగబోవు పోటీలకు అర్హత సాధించిన నిరుపేద గ్రామీణ క్రీడాకారిణి ప్రోత్సహిస్తూ ఆమెకు ఆర్థికంగా తోడ్పాటుగా తమ వంతుగా ఐదు వేల సహాయాన్ని బ్రహ్మంగారిమఠం మండల శాఖ బాధ్యులు జి బాబు జి గురవయ్య ఎం హరినాథ్ ఎం వీరనారాయణ సి సుబ్బయ్య అన్వర్ భాష మొదలగు వారు కలిసి ఆమెకు అందజేశారు ,వారితో పాటు స్థానిక బాలికల వసతి గృహ సముదాయం వార్డెన్ వెంకటేశ్వరమ్మ ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు అనంతరం మేధా డిఫెన్స్ అకాడమీనందు జరిగిన ఐదవ సీనియర్ ఇంటర్ డిస్టిక్ జంప్ రోప్ ఛాంపియన్షిప్ నందు విజేతల నిలచిన పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయ బృందం సత్కరించారు ఈ జంప్ రోప్ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు కాయిన్ ఎర్త్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సునీల్ కుమార్ సింగ్ వారి కుటుంబ సభ్యులు భోజన సదుపాయాన్ని కల్పించారు

## విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



**బ్రహ్మంగారి మఠం: ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:**
కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో బ్రహ్మంగారిమఠం అట్లూరు పాఠశాలల్లో కూడా పంపిణీ చేయడం జరిగిందని బ్రహ్మంగారిమఠంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 866 మంది బాల, బాలబాలికలకు సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమాస్ రెడ్డి, డాక్టర్. గీతా దంపతులు ఉచితంగా చలి దుప్పట్లను పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వసతి గృహాలలో చదువుచు చలికాలంలో ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో ఈ చలి దుప్పట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపల్స్ ఉపాధ్యాయినిలు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏ.పీ.ఎస్.జి.ఆర్.ఈ.ఏ నూతన కార్యవర్గం ఎన్నిక

**పీలేరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఏ.పీ.ఎస్.జి.ఆర్.ఈ.ఏ) అన్నమయ్య జిల్లా విభాగం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి టి. జయరామ నాయుడు తెలిపారు. బుధవారం పీలేరు పెన్షనర్ల సంఘ భవనంలో



పీలేరు యూనిట్ అధ్యక్షులు ఒగల్ళ చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య, మదనపల్లె యూనిట్ అధ్యక్షులు సుబ్రమణ్యం, గుర్రంకొండ యూనిట్ అధ్యక్షులు యూసఫ్ సాహెబ్, కార్యదర్శి హెచ్ఎం మహబూబ్ అలీ ఖాన్, వాయల్పాడు కార్యదర్శి ఎం. రాజగోపాల్, కలికిరి యూనిట్ కార్యదర్శి జి. జయరాం, పీలేరు కార్యదర్శి ఎర్రం రాజు, కోశాధికారి కృష్ణయ్య, సీతారామయ్య, ఉపాధ్యక్షులు నిర్మలాదేవి, మరో 50 మంది సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. 15 పోస్టుల కోసం 15 మందిని ప్రతిపాదిస్తూ పీలేరు యూనిట్ అధ్యక్షులు వి. చంద్రారెడ్డి, కలికిరి ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి బలపరిచారు. కార్యవర్గంలో అధ్యక్షులుగా ఆర్. రాజగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి. శంకరయ్య, కోశాధికారిగా పి. జగన్మోహన్, ఉపాధ్యక్షులుగా ఎన్. రామచంద్రయ్య, పి. సుబ్రమణ్యం, యం. రాజగోపాల్, ఉపాధ్యక్షులుగా యూసఫ్ సాహెబ్, రాజగోపాల్, జి. జయరాం, ఎన్.వి. రమణ, కార్యదర్శులుగా వి. నిర్మలాదేవి, కె. సయ్యద్ అమీర్, రామానుజమ్మ, కె. వెంకటరమణ, సీతారామయ్య, దేవేంద్ర పేర్లను ప్రకటించారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత లక్ష్యాన్ని చేరాలి



**చిట్వేలి, ఫిబ్రవరి,5 ప్రభాతవార్త:**
ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి ఎన్ జయప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో రైల్వే కోడూరు ఏఎస్ డబ్ల్యుఓ పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పరీక్షలకు భయాన్ని వీడి, క్లుప్తంగా అర్థం చేసుకొని సంసిద్ధం కావాలని విద్యార్థులకు జిల్లా అధికారి సూచించారు. జీవితాన్ని నిర్ణయించే కౌమార దశలో (15 25) కష్టంతో శ్రమిస్తే జీవితం సుఖమయం అవుతుందన్నారు. తల్లిదండ్రుల ఆశలను నిజం చేసే బాధ్యత మీదేనని విద్యార్థులకు సూచించారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ శ్రమ నీ ఆయుధం అయితే ఫలితం నీ సొంతమవుతుందని విద్యార్థులను ప్రోత్సహించారు. మోటివేటర్ హరి విద్యార్థులు తమ ఉపాధ్యాయులు సూచించిన ప్రశ్నలను సంపూర్ణంగా నేర్చుకుని, సూచనలు పాటించి పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. వార్డెన్లు కిరణ్ కుమార్,తిరుపతిరెడ్డి లు మాట్లాడుతూ వెనుకబడ్డ విద్యార్థుల పురోగతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని 100 శాతం ఫలితం సాధిస్తామని తెలియపరిచారు. గణిత ఉపాధ్యాయుడు రమణ, హిందీ అధ్యాపకులు నవీన్, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు చంద్రయ్య లు ఏ విధంగా ప్రశ్న పత్రాన్ని పూర్తిస్థాయిలో నింపి ఉత్తమ ఫలితాలను పొందవచ్చునో విద్యార్థులకు చక్కగా వివరించారు. 90 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నగా, వారిలో స్థానిక హాస్టల్ విద్యార్థులు 60 మంది ఉన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏబీఎన్ ప్రసాద్, సిహెచ్ఎస్ బాధ్యుడు గాడి ఇంతియాజ్, పాత్రికేయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకించండి




**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
దగాకోరు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా అనిబిసెంట్ సర్కిల్ నందు ఏపి రైతు, వ్యవసాయ, కౌలురైతుల సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను దగా చేసేదిగా ఉందన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఉపాధి పథకానికి భారీగా కోత విధించిదన్నారు. కార్పోరేట్‌లకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించకుండా మరోసారి మోసం చేసిందన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు నారాయణ, పవన్, రాజశేఖర్, రెడ్డిప్రసాద్, చాంద్‌బాషా, రామక్రిష్ణ, చలపతి నాయుడు, రాజు, శంకర్‌నాయక్, నరసింహులు, తిరుమల, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ పథకాలు మరచిన కూటమి

**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు అవుతున్నా ఇంతవరకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎస్.కె.బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నీ కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. మదనపల్లె మెడికల్ కళాశాల, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేటీకరణ చేసే విదానాన్ని మానుకోవాలన్నారు. రాయలసీమకు తాగునీరు, సాగునీరు అందించేందుకు గానూ అసంపూర్తిగా ఉన్న హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులకు నీరు ఇవ్వాలన్నారు. హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేసి అదనంగా నీటిని సరఫరా చేయాలన్నారు. కరువుగడ్డగా పేరుపొందిన రాయలసీమలో పెండింగ్‌లోని ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా త్వరలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో మైనార్టీలకు నిధులు కేటాయించాలన్నారు. మైనార్టీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో అధికారులు విచారణ



**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
పట్టణంలోని అయ్యప్పనగర్‌లో వెలసియున్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ విశ్వనాథ్ విచారణ చేపట్టారు. ఆలయ మాజీ ఛైర్మెన్ రెడ్డప్పరెడ్డి గతంలో చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఆలయ ఆవరణంలో ఫిరమిడ్ గదిని తొలగించడం, పూజారి వ్యవహారశైలిపై భక్తులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టడం జరిగిందన్నారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేధిక ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జర్మన్‌రాజు, హేమంత్, భగవాన్, శివమూర్తి, నాగరాజు, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
ఏఐటియుజి అన్నమయ్యజిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని పట్టణ కార్యదర్శి తిరుమల తెలిపారు. బుధవారం ఏఐటియుజి జిల్లా వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణప్ప చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా ఏఐటియుసి 1920అక్టోబర్ 31న ముంబైలో ఆవిర్భవించిందన్నారు. ఈ నెల 16, 17న రెండు రోజులు పాటు రైల్వేకోడూరులో ఏఐటియుసి జిల్లా మొదటిమహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలపారు. ఈసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముబారక్, నాగరాజు, వృద్వి, వంశీ, ఓబులేసు, గంగులప్ప, వీరాంజనేయులు పాల్గొన్నారు.

## నేషనల్ మజ్దూర్ యూనిట్ సమావేశం

**మదనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
పట్టణంలోని దేశాయ్ పంక్షన్‌హాలులో బుధవారం ఆర్టీసి వన్‌డిపో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు జిల్లా కార్యదర్శి ఎస్ఎం. రాజు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కడప జోనల్ సెక్రటరీ చెన్నారెడ్డి, రాష్ట్ర సిసిసెస్ఎంసి మెంటర్ వినోద్‌బాబు, జిల్లా అధ్యక్షులు ఎంఎస్.రావు హాజరుకావడం జరిగింది. ఈ సమావేశానికి 150 మంది హాజరయ్యారు. చెంగారెడ్డి ప్రసంగిస్తూ ఎపిపిటిడిలో ఉద్యోగులకు నాలుగు ఏళ్ళు నుంచి ఏక్యాడర్‌కు కూడా ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. పేస్కేల్ అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రతా సర్కులర్‌ను అమలు చేయాలని తెలిపారు. అనంతరం డిపో నూతన కమటీని ఎన్నిక చేయడం జరిగింది. డిపో అధ్యక్షులుగా వివి.రమణ, డిపో కార్యదర్శిగా కె.రెడ్డిబాషాను ఎన్నుకోవడం జరిగింది.



## వేతనాలన పెంపు కోసం...

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**



కడప నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా మా వేతనాలు మాత్రం పెరాగలేదని చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని అవుట్సోర్సింగ్ ఉద్యోగులు అజాముద్దీన్, ఎస్ఎండి.ఖాసీం, రామసుబ్బారెడ్డి, ఆనంద్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఇంజనీరింగ్ సెక్షన్ లో 350 మంది ఔట్సోర్సింగ్లుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని, రూ.13 వేల జీతం ఏమాత్రం సరిపోవడం లేదని ఎమ్మెల్యేతో చెప్పుకున్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని వేతనాలు పెంచాలని ప్రార్థించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రమేష్, ఎస్వి. రమణ తదితర ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

**రామసముద్రం పిబ్రవరి 5 ప్రభాతవార్త**



రామసముద్రం మండలం మినికి గ్రామ పంచాయతీ బూడిదపల్లె గ్రామంలో సమతా సైనిక్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేసి గొప్ప అన్న దానకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ అధ్యక్షులు జయరాజ్, అరికల రామాంజులు, ఏపీ మోడల్ స్కూల్ ఛైర్మన్, సమతా సైనిక్ వైస్ ప్రెసిడెంట్ బాలాజీ, నాగరాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**



కడప నగరంలోని జడ్పీ కాంపౌండ్‌లోని ప్రేమాలయ నిరాశయుల వసతి గృహంలో బుధవారం శ్రీ సాయి యువజన సేవా సంఘం ఛైర్మన్, టిడిపి నేత మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడం దేవుడు కల్పించడం మహాభాగ్యంమన్నారు. కార్యక్రమంలో మలిరెడ్డి కృష్ణారెడ్డి, మలిరెడ్డి శివ శంకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు ముదిరెడ్డి భాస్కర్ రెడ్డి, డి.సుబ్బారాయుడు, ఎంవికృష్ణారెడ్డి, పి.శివశంకర్,వసతి గృహ నిర్వాకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ , 104 సేవలను సద్వినియోగం చేసుకోండి

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త.**



ఎన్టీఆర్ వైద్య సేవలను సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవల కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. బుధవారం మదనపల్లి, కురబలకోట మండలాల పరిధిలోని 104 వైద్య సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వం దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు 104 సేవలలో అందిస్తోదన్నారు. 105 రకాల మందులు మరియు 14 రకాల పరీక్షలు అన్ని ఉన్నాయా, వాటిని వైద్యులు మరియు సిబ్బంది ఉపయోగిస్తున్నారా, వాహనం కడీషన్‌లో ఉందా అనే విషయాలపై నివేదిక రాష్ట్రానికి పంపడం జరుగుతుంది అన్నారు. అనంతరం 108 అంబులెన్సు వాహనం తనిఖీ చేసి ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఉన్నాయా లేదా అని చూసారు. ఈ కార్యక్రమంలో 104 మరియు 108 సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ అభివద్ధికి సహకరిస్తాం

**పీలేరు. ఫిబ్రవరి 05 ప్రభాతవా!**
గతంలో ఇప్పుడైనా పంచాయతీ బోర్డు తీర్మానానికి వ్యతిరేకులం కామని పీలేరు గ్రామ పంచాయతీలో ఈ భాధ్యతలు తీసుకున్న గురుమోహన్ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఏఏ అభివద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశారో తెలియజేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచితో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కల్వర్టర్ పనులను పరిశీలించిన ఎంపీడీఓ

**కలకడ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



కల్వర్టర్ పనులను ఎంపీడీవో అబ్దుల్ రహీం పరిశీలించినట్లు తెలిపారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఆర మడకలవారిపల్లె సమీపంలో మరమ్మతుకు గురైన కల్వర్టను పనులను పరిశీలించి నాణ్యతతో నిర్మించాలని సూచించినట్టు తెలిపారు. పశువుల షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులకు వెళ్లి వస్తున్న మహిళలతో పనుల విషయంగా ముచ్చడించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ రూపు సాగర్, ఏపీఓ చెన్నకేశవులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సమరసింహారెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## ప్రజాసేవలో డివిఎంసి

**పీలేరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



పీలేరు మండల పరిధిలోని 15 పంచాయతీలకు సంబంధించి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బోధి షావలి అన్నారు. పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ ఆకుల వారి పల్లి గ్రామంలో ప్రజలు వీధి దీపాలు వెలగడం లేదని సమస్యను డివిఎంసి ద్వారా దొడ్డేపల్లి పంచాయతీ సెక్రెటరీ సిద్దయ్యను వివరించడం జరిగింది. 24 గంటలు గడవక ముందే ఆ సమస్యను పరిష్కరించడం హర్షణీయమని డివిఎంసి సభ్యులు బోధి షావలి అన్నారు. ఇదేవిధంగా పీలేరు మండల అధికారులను సమన్వయ పరచుకొని ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కార దిశగా కృషి చేస్తామని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బోధిషా వలి అన్నారు.

## అన్నీ తామై అంత్యక్రియలు

**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



గవర్నమెంట్ హాస్పిటల్ నందు గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యం చేత చికిత్స పొందుతు మరణించగ అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు ముందుకు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబాహాన్‌ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి బుధవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, అహమద్ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ బాలు, కృప ఆగ్నీ షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు, శ్రీరామ్, ప్రసన్న కుమార్, రమేష్ , కిరణ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రీవెరిఫికేషన్ చేయించుకోవాలి

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**



ప్రభుత్వ ఆసుపత్రిలో బుదవారం నుండి వికలత్వ సదరం సర్టిఫికెట్‌లు రివెరిఫికేషన్ జరుగుతుందని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పివి నాగేశ్వరరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సదరం సర్టిఫికెట్ లు పొందిన ప్రతి ఒక్కరూ సర్టిఫికెట్‌లో పరిశీలన చేయించుకోవాలని కోరారు. వారంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కడప నుండి ఆర్తో విభాగం సదరం సర్టిఫికెట్ పరిశీలన అధికారిగా డాక్టర్ మహిదర్‌రెడ్డి పరిశీలించడం జరుగుతుందని రోజుకు యాభై సర్టిఫికెట్‌లు పరిశిలిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని లేని పక్షంలో సర్టిఫకెట్‌లు రద్దు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు.

## వేలం ద్వారా క్రయం పొందిన
# ఆస్తికి అందలి విలువే ఆధారం

**బద్వేలు లీగల్, ఫిబ్రవరి 05 ప్రభాతవార్త :**
వేలంలో కొనుగోలు చేసిన ఆస్తికి సదరు ధృవీకరణ పత్రం (సేల్ సర్టిఫికెటు) లో పేర్కొన్న విలువ ఆధారంగానే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేయాలే తప్ప మార్కెటు విలువను బట్టి కాదని హైకోర్టు పునరుద్ఘాటించింది. దీనిపై గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా దేశంలోని క్రింది కోర్టులు, అధికారులు కూడా నడుచుకోవాలని నిక్కచ్చిగా తేల్చి చెప్పింది. స్టాంపు రుసుము, రిజిస్ట్రేషన్ రుసుము వసూలు వ్యవహారంలో కూడా సబ్ రిజిస్ట్రార్లు, రిజిస్ట్రార్లు సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరించడంతో న్యాయస్థానంలో పుంకాను పుంకాలుగా కేసులు దాఖలవుతున్నాయని గుర్తు చేస్తూ కోర్టు తీర్పులు, చట్టాలలో మార్పుల గురించి సబ్ రిజిస్ట్రార్లకు, రిజిస్ట్రార్లకు కూడా అవగాహన కల్పించాలని, కోర్టు తీర్పులు, చట్టాలలో మార్పులపై ఎప్పటికప్పుడు అధికారులకు అవగాహన కల్పించేందుకు అడ్వకేట్ జనరల్‌ను సంప్రదించి నాలుగు వారాలలో లీగల్ మ్యాన్యువల్‌ను కూడా రూపొందించాలని రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులపై పురోగతిని తెలియజేసేందుకు విచారణను కూడా వాయిదా వేసింది. ఆంధ్ర రాష్ట్ర అత్యున్నత న్యాయస్థాన న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఇటీవల ఈ తీర్పును వెలువరించారు. గతంలో కెనరా బ్యాంకు నిర్వహించిన వేలంలో తిరుపతి సెంట్రల్ పార్క్ వాణిజ్య సముదాయంలోని పలు దుకాణాలను రు.2.17 కోట్లకు కడపకు చెందిన కొందరు వ్యక్తులు కొనుగోలు చేసుకుని వేలాన్ని నిర్ధారిస్తూ కెనరా బ్యాంకు సేల్ సర్టిఫికెటు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సదరు ఆస్తిని సంబంధిత వ్యక్తుల పేరున రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ కొనుగోలుదారులు సంబంధిత సబ్ రిజిస్ట్రారును కోరగా రిజిస్ట్రేషన్ చేయాలంటే ప్రస్తుత మార్కెటు విలువ ప్రకారం స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలేగానీ అందలి వేల విక్రయ పత్రంలోని విలువ మీద కాదని తెలుపగా కొనుగోలుదారులు అందుపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు చేయగా పిటీషనరు వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి సేల్ సర్టిఫికెటులో పేర్కొన్న ఆస్తి విలువను మాత్రమే ఆధారంగా తీసుకుని స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజును నిర్ణయించి సదరు సేల్ సర్టిఫికెటును రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఆ కేసుకు సంబంధించి తీర్పు (రిట్ ఆఫ్ మాండమస్ నెం.298/20-01-2025, హెచ్ సి, ఆం.ప్ర.) ను వెలువరించారు.

## లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందేనా

**మైదుకూరు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**
మున్సిపాలిటీ పరిధిలో లబ్ధిదారులకు నూతన పింఛన్లు వస్తాయని ఆశతో చూస్తున్నారు. వయసు పైబడినవారు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, మగవారు, ఇతర సమస్యలపై ఉన్న వారికి ప్రభుత్వం ఒకటవ తేదీన పింఛన్ పంపిణీ చేస్తుంది. మున్సిపాలిటీ పరిధిలో పూట గడవని పేదవారు ఎంతోమంది ఉన్నారు. కష్టపడితే గాని డొక్కాడదు పనికెళ్తే గాని సాయంత్రం ఐదు వేళ్ళు నోటి వరకు వెళ్లవు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు వచ్చే విధంగా చూడాలని స్థానికులు వేడుకుంటున్నారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించి మంచాన ఉన్న వ్యక్తులు, 60 ఏళ్ల పైబడిన లబ్ధిదారులకు, వికలాంగులకు ప్రభుత్వ సొమ్ము అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వయసు మీద పడి చేతికి కర వచ్చిన వారికి స్పందించకుండా కొందరు పింఛన్లు అర్హత ఉన్న కార్యాలయ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేడు చేపల చెరువులకు వేలం

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



రాచవేటివారిపల్లె పంచాయితీలోని 14 చెరువులకు బహిరంగ వేలం గురువారం జరగనున్నది. ఈ మేరకు ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సనర్పంచ్ కె.సుబ్రమణ్యం అధ్యక్షతన ఈఓ ఆర్‌డి చలపతిరావు ఆధ్వర్యంలో వేలంపాట జరుగుతుందని తెలిపారు. రాచవేటివారిపల్లె సచివాలయం న వద్ద ఉదయం 11గంటలకు వేలం ప్రారంభం అవుతుందన్నారు.

## భూ ఆక్రమాలపై రెవిన్యూ మంత్రికి ఫిర్యాదు

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి5 ప్రభాతవార్త**
రాజంపేట మండలం ఆకేపాడులో వైకాపా హయాంలో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కు రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చమర్తి సురేష్ రాజు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా నాయకులు చేసిన భూ అక్రమాలకు సంబంధించి వివరాలను అందజేశారు. ఇటీవల కాలంలో రాజంపేట మండలం తెలుగుదేశం పార్టీ ఏజెంట్లకు సంబంధించి జరిగిన భూ వివాదాలపై నిబంధనలకు విరుద్ధంగా వైకాపాకు కొమ్ము కాస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని మంత్రిని కోరినట్లు సురేష్ రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ విచారణ జరిపించి,సంబంధిత అధికారులపై చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## హుండీ లెక్కింపు

**చిట్వేలి, ఫిబ్రవరి 5, ప్రభాత వార్త:**



స్థానిక చిట్వేలి గ్రామంలోని మట్లి రాజుల కాలంలో నిర్మితమైన పురాతన శ్రీ సోమేశ్వర స్వామి మరియు శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవాలయాల హుండీ ఆదాయాలను లెక్కించినట్లు డివిజన్ దేవాదాయ శాఖ ఈవో కొండారెడ్డి తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమంలో శ్రీ భక్తాంజనేయ స్వామికి 32475 రూపాయలు, శ్రీ సోమేశ్వర స్వామి వారికి 401430 రూపాయల ఆదాయం చేకూరిందని తెలిపారు. ఈకార్యక్రమములో అర్చకులు అరవింద్ శర్మ, గ్రామస్తులు తోట శ్రీనివాసులురెడ్డి, మాజీ ధర్మకర్త ఇరసారెడ్డి, వెంకటేశు, నరసింహులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై రైతు కార్మిక సంఘాల నిరసన




**చిన్నమండెం ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**
కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న కార్మిక. రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం దేశవ్యాప్తంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు రైతు సంఘాలు ఫిబ్రవరి 5న బుధవారం దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలలో భాగంగా స్థానిక చిన్నమండెం ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చాలని ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.9 వేలకు తక్కువ లేకుండా చెల్లించాలని, ఆటో హమాలీ వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు, రద్దు చేసిన భవణ నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు రెడ్డెమ్మ, మేరీ సులోచన, శ్రీలత, సిద్దమ్మ, మునీరా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 7న మండల సాదరణ సర్వసభ్య సమావేశం

**చిన్నమండెం ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**
శుక్రవారం 7 వ తేదీన ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీసు సభాభవనం నందు సాధారణ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు యంపిడిఓ శేఖర్ నాయిక్ తెలిపారు. కావున జడ్పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఈ సమావేశానికి హాజరు కావలసిందిగా కోరారు.

## కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన



**కలకడ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**
కుష్టి వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంవి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గత నెల 30 తేదీ నుండి ఈనెల 13వ తేదీ వరకు స్పర్శ కుష్టు వ్యాధి పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలోని కదిరాయచెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులకు మరియు 104 సేవలకు హాజరైన ప్రజలకు డి.ఎమ్.హెచ్.ఓ వారి ఆదేశాల మేరకు డాక్టర్ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ ఏడ్యూకేటర్ మహమ్మద్ రఫీ కుష్ఠ వ్యాధి సర్వే, లక్షణాలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరము కుష్ఠువ్యాధి ఇంటింటి సర్వేను "అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్ఠువ్యాధిని గుర్తించి చికిత్స ను అందిస్తాము "అనే తీమ్‌తో చేస్తున్నామని తెలిపారు. కుష్ఠువ్యాధి ఒక సూక్ష్మ క్రిమి వల్ల వస్తుంది. స్పర్శ లేని మచ్చులు,రాగి రంగులో ఉండి మచ్చ పై భాగం లో వెంట్రుకలు మొలచవు. నొప్పి ఉండదు .మిన, మిన మని మెరుస్తూ ఉంటాయి.

## స్టెమీ చికిత్స గుండెకు భరోసా

**వాల్మీకిపురం ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు స్టెమీ చికిత్స భరోసా కలిగిస్తుందని అన్నమయ్య జిల్లా, వాయలపాడు మెడికల్ ఆఫీసర్ బి.రవికుమార్ అన్నారు. వాయలపాడు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండెజబ్బులకు సంబంధించిన స్టెమీగుండెకు భరోసా అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండడం, గుండె దడ, స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే అప్రమత్తం కావాలన్నారు. అవి ప్రారంభమైన మొదటి గంటలోపు ఆసుపత్రికి వస్తే వారికి పరీక్షలు నిర్వ హించి రూ.45 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా అందిస్తారన్నారు. ప్రజలంతా ఇలాంటి స్టెమి చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాయలపాడులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి బి. రవికుమార్, అడిషనల్ స్టెమి నోడల్ ఆఫీసర్ డాక్టర్ సోనీ, డాక్టర్లు హర్షితరెడ్డి, శివాని, శ్రీలక్ష్మి, ఆసిఫ్, మమత పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం కడప ఎస్పీ కార్యాలయంలో కలిశారు. పూల బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ భవన్ ను సందర్శించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజులు జిల్లా ఎస్పీని సాదరంగా ఆహ్వానించారు. కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా గతంలో ప్రజలకు మంచి సేవలు అందించారని కొనియాడారు. మళ్లీ జిల్లా ఎస్పీగా రావడం తమకు సంతోషంగా ఉందన్నారు. బీసీల హక్కుల పరిరక్షణలో సహకారం అందిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎస్పీ ని కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు పస్తం అంజి, కోశాధికారి శ్రీనివాసులు, సిఆర్ఐ సునీల్ జయంత్, సుంకేసుల ఖాదర్ బాషా, మునిరత్నం గౌడ్, రంగయ్య, గంగయ్య ఉన్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ)భూ సదస్సు

**మైదుకూరు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**




భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూ సదస్సును పట్టణ బద్వేల్‌రోడ్డులోని గంగమ్మ దేవాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.షావలి అధ్యక్షత వహించగా భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగసుబ్బారెడ్డి ముఖ్యఅతిథి వ్యవహరించారు, భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏ.వి.శివరాములు విచ్చేశారు. ఈ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలందరికీ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని అలాగే నిరుపేద భూమిలేని వ్యవసాయ కూలీలకు ఒక హెక్టారు వ్యవసాయ భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.వి. శ్రీనివాసులు, బాలసుబ్బయ్య, సుబ్బరాయుడు, భవన నిర్మాణ సంఘం నాయకులు పీరయ్య, భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, లక్ష్మయ్య, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం




**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త**

నేల, నీరు, గాలి మనకు ప్రకృతి ప్రసాదించిన వరాలని వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మీసరగండ నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్జీసి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ క్రాప్స్ రాజంపేట రీజియన్ కోఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీ ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. చిత్తడి నేలలు సముద్రానికి, నేలకు మధ్యలో వారధులుగా ఉండి అటు సముద్ర నీటిని శుద్ధిచేయుచు ఇటు పరివాహక ప్రాంతాలను వరదల నుండి కాపాడుటలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. అయితే ప్రస్తుతం కాలుష్యం కారణంగా కొందరు అవగాహనా రాహిత్యంతో చిత్తడి నేలలను ధ్వంసం చేయడం ద్వారా విలువైన మ్యాంగ్రూవు మొక్కలు, అరుదైన చేప జాతులు అంతరించిపోతున్నాయన్నారు. దీనివల్ల భవిష్యత్ తరాలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరు పర్యావరణం పట్ల స్పృహను కలిగి ఉండి సహజ వనరులు కాపాడుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఎన్జీసీ కో ఆర్డినేటర్ శిల్పి ఆనందాచారి ఆధ్వర్యంలో జరిగిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులచే గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, గౌరి, తులసీ స్వర్ణలత, బోగా వెంకటసుబ్బయ్య, మస్తాన్ జ్యోతిప్రియ, గీత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు. చిత్రలేఖనంలో రాఘవేంద్ర, దివ్య, అఖిల వ్యాసరచన స్పందన, మోహన్‌కృష్ణ, నాగభవితలకు, వక్తృత్వంలో హర్షిణి, భవ్య, కార్తీక్ లకు బహుమతులను ప్రధానం చేశారు.

# లీకులతో తాగునీటి వధా

**పీలేరు, ఫిబ్రవరి 05 ప్రభాతవార్త:**

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కూటమి ప్రభుత్వం కతనిశ్చయంతో ఉంది. ఈమేరకు ఆర్డబ్ల్యూయస్ పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు సురక్షిత మంచినీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇందుకు నిదర్శనం పీలేరు పంచాయతీలో చోటుచేసుకున్న తాగునీటి పైపులు పగిలిపోయి నీరు లీకవుతూ తాగునీరు కలుషితం అవుతుంది.

**ఎక్కడెక్కడ అంటే!**

పీలేరు పంచాయతీలోని 20 వార్డులు ఉండగా 60వేల మంది జనాభా ఉన్నారు. సుమారు 150 మంది పంచాయతీ ఉద్యోగులు కార్మికులు, పనిచేస్తున్నారు. పంచాయతీ పరిధిలో ప్రజలకు తాగునీరు అందించడానికి పింఛా నది గట్టుల వెంబడి బోరుబావులు తవ్వి సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు కొత్తపల్లె సమ్మర్ స్టోరేజీ నుంచి కూడా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇది ఇలా ఉంటే పీలేరు పట్టణంలో జరుగుతున్న ఆరబీ కారణంగా ఎక్కడికక్కిడ పైపులు పగిలిపోయి నీరు వధా అవుతోంది. ఫలితంగా తాగునీరు కలుషితమవుతుందని ప్రజలు అధికారులు దష్టికి తీసుకువస్తున్నారు. ఎక్కువగా పీలేరు పంచాయతీ కార్యాలయం నుంచి మదనపల్లె మార్గంలోని పింఛా నది వరకు పలు చోట్ల తాగునీటి పైపు లైనులు పగిలిపోయి తాగునీరు వధా అవుతోంది.



పైపులు పగిలిపోయి నీరంతా వధా.... అవుతున్నా పంచాయతీ పాలకులు అధికార పాలక వర్గాలు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రజలకు కలుషిత నీరు తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**మరమ్మతులు చేపడుతాం!**

పంచాయతీ పరిధిలో జరుగుతున్న రైల్వే వంతెన పనులు కారణంగా పైపులు అక్కడక్కడ పగిలిపోయాయి. పగిలిన చోట మరమ్మతులు చేస్తున్నా జేసీబీలతో రోడ్డుకు ఇరువైపుల తవ్వుతుండటంతో తిరిగి పగిలిపోతున్నాయి. పైపులు పగిలిన చోట మరమ్మతులు చేపట్టి స్వచ్ఛమైన నీరు అందించడానికి చర్యలు తీసుకుంటాం.

**పంచాయతీ ఈఓ గురు మోహన్.**

## ఆరోగ్యం ,పరిశుభ్రతపై అవగాహన



**పులివెందుల రూరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.శరణ్య గారు (గైనకాలజిస్ట్) మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులతో చర్చించారు. రక్తహీనత సమస్యలు రుతు సమస్యలపై అవగాహన కల్పించారు. మహిళలు ప్రస్తుతం కుటుంబ నిర్వహణలో తమ ఆరోగ్యాలను నిర్లక్ష్య పరచుకోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాల సమయంలో విద్యార్థినులకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు కళాశాల ఉమెన్ సెల్ ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకుని, డాక్టర్ ను సంప్రదించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. తదుపరి సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, వంటలు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు కొరకై ఆర్థిక సహాయం చేసిన ఎస్.బి.ఎస్ గార్మెంట్స్, షూమార్ట్ , పబ్బతి టెక్స్ టైల్స్ వారి ఆధ్వర్యంలో డా.శరణ్య, మా ఊరి సినిమా ప్రొడ్యూసర్ మంజునాథరెడ్డి, ఫిల్మ్ మేకర్ హరి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి కళాశాల పిఆర్ఓ డా.సి.బాల నారాయణ, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్.కె.విజయలక్ష్మి, డాక్టర్ రాధిక, డాక్టర్ రమీజా, హేమావతి, లిఖిత ,వాణి, ఆనందరావు, ప్రశాంతి, సువర్ణ, శిరీష, అధ్యాపక,అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉద్యాన క్రీడలు హోరా హోరీగా..

**రైల్వే కోడూరు ఫిబ్రవరి 5 ప్రభాత వార్త:**

నియోజకవర్గంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో జరుగుతున్న 11వ క్రీడా పోటీల్లో రెండవ రోజు హోరాహోరీగా క్రీడలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన తొమ్మిది కళాశాలల నుంచి విచ్చేసిన క్రీడాకారులు ఖోఖో, పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్ త్రోబాల్ తదితర క్రీడలతో పాటు సాంస్కృతిక పోటీలలో తోటి విద్యార్థులతో హోరాహోరీగా క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడల్లో 1500 మీటర్ల పరుగు పందెంలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాలకు చెందిన బాలురు మొదటి స్థానంలో నిలవగా, బాలికలు రెండవ స్థానాన్ని దక్కించుకున్నారు. కాగా డిస్క్ త్రోబాల్ పోటీల్లో మొదటి రెండవ బహుమతులను కైవసం చేసుకుని అంతర్ క్రీడా పోటీలలో ఉద్యాన కళాశాల విద్యార్థులు క్రీడలలో అంతిమ విజయాన్ని సొంతం చేసుకుంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెం ఉద్యాన యూనివర్సిటీ విద్యార్థులు కొన్ని పోటీలలో విజయం సాధించి ముందంజలో నిలిచారు. వీరితోపాటు పలు ఉద్యాన కళాశాలలకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచేందుకు తోటి క్రీడాకారులతో హోరా హోరీగా క్రీడలలో తలపడుతున్నారు. ఈ క్రీడలో ఫిబ్రవరి 7వ తేదీ వరకు జరుగుతున్నాయని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పి టి శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ రవిశంకర్, ప్రొఫెసర్లు ఓ ఎస్ ఏ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ గిరిధర్, శివప్రసాద్, సురేంద్ర నాథ్ రెడ్డి, మల్లికార్జునెడ్డి, ముకుంద లక్ష్మి, డాక్టర్ రూత్, శిరీషా దీప్తి, లలిత జయప్రద తో పాటు కిరణ్, లలిత ,జయప్రద తో పాటు తొమ్మిది కళాశాలలో చెందిన ఫిజికల్ డైరెక్టర్లు క్రీడాకారులు అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే



**తొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**

తొండురులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రధానోపాధ్యాయుడు అధ్యాపక సిబ్బంది పాల్గొని రేపు నెల జరగబోయే పరీక్షలకు విద్యార్థిని, విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి కళాశాల కళాశాల సిబ్బందికి మరియు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని కొనియాడారు ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఘనంగా నిర్వహించుకున్నారు.

## పెద్ద శేష వాహనం పై శ్రీవారి దర్శనం

**పులివెందుల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**



పులివెందులలో వెలసిన శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ వారు పెద్ద శేష వాహనం పై భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకుముందు ఆలయం ఎదుట దీపోత్సవం వైభవంగా నిర్వహించారు.

## ఉషాకిరణ్ పాఠశాల విద్యార్థినికి ప్రథమ బహుమతి

**వేంపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**

జంతు సంక్షేమ పక్షోత్సవాలను పురస్కరించుకుని జిల్లా జంతు సంక్షేమ సంఘం వేంపల్లి మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పీ.వీ. ఉష ప్రథమ బహుమతి సాధించినట్లు కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లి మండల విద్యా వనరుల కేంద్రంలోజరిగిన కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు మంగేశ్వర రావు విద్యార్థినికి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టు స్టాలిన్ ఐజాక్, సహాయ సంచాలకులు డాక్టర్ సి .రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ ఎం. సాధిక్ భాష, జంతు సంక్షేమ సంఘం సభ్యులు గోవర్ధన్, సుమన్ పాల్గొన్నారు.

## శాంతియుత ర్యాలీ

**లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 05 ప్రభాతవార్త**

రాజ్యాంగ లౌకిక విలువలను కాపాడాలంటూ మండల బిజెపి జిల్లా కార్యదర్శి ఆనంద్ గజపతిరాజు, హిందూ చైతన్య వేదిక సృజన కుమార్ లు పేర్కొన్నారు బుధవారం కుర్నూతల ఎస్బిఐ బ్యాంకు నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్బీఐ కర్నూతల బ్యాంకు సమీపంలో హిందువుల నివాస గృహాల మధ్య ఓ వర్గం వారు ప్రార్థనా మందిరం నిర్మించి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో తమకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొంతమంది బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారంటూ స్థానిక మహిళలు, యువకులు ,హిందూ సంఘాల ప్రతినిధుల తో కలిసి బుధవారం మండల కేంద్రంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్, శ్రీనివాసులు యస్ ఐ రవీంద్ర బాబులకు పోలీసు అధికారులకు వినతి పత్రం వి అందజేసి తమకు న్యాయం చేసి రాజ్యాంగ, లౌకిక విలువలను పరిరక్షించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ మండల అధ్యక్షుడు కొండూరు వెంకట్రామ రాజు, సురేష్, నరసింహులు, ఉష, శుభాషిణి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## రైతులు అభిప్రాయాలను తెలియజేయండి

**బద్వేలు , అర్బన్ ,ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన రైతులు, సభ్యులు ఎవరైనా తమకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే నూతనంగా నియమింపబడిన సహకార సంఘ సభ్యులకు తెలియజేయవచ్చని సంబంధిత జిల్లా శాఖ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా నియమించిన వారి వివరాలు, మరియు ఫోన్ నెంబర్లను తెలియజేశారు. బద్వేల్ మండలం చెన్నకేశం పల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ఎస్ నాగముని (7780396561) ,బ్రాహ్మణపల్లి సహకార సంఘానికి ఎస్.కెరహమత్‌అలీ (789313041), బికోడురు సహకార సంఘానికి కే ఆనంద్‌కుమార్ (9849574212), కాశినాయన మండలం నరసాపురానికి వెంకటరమణ (9618611747), కలసపాడు మండ్నల చెందిన కొత్తకోట సహకార సంఘానికి ఈశ్వరయ్య (9966060594), లను నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత సహకార సంఘాల పరిధిలోని రైతులు తాము తీసుకున్న లోన్ల విషయాలను తమకు జరిగిన అన్యాయాలను ఫోన్ నెంబర్ల ద్వారా గాని నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకోవచ్చు అన్నారు.

## భారత షూటింగ్ బాల్ జట్టుకు మహమ్మద్ యూసఫ్

**మొలకలచెరువు ఫిబ్రవరి 4: ప్రభాతవార్త**



గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆంధ్రప్రదేశ్ నుండి అన్నమయ్య జిల్లా,తంబళ్లపల్లి కుర్రాడు మహమ్మద్ యూసఫ్ ను హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ ఇండియా. ఏపీ తెలంగాణ విజిలెన్స్ చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత సామాన్య కుటుంబం నుండి వచ్చి మన దేశం తరపున నేపాల్ దేశంలో జరుగుతున్న షూటింగ్ బాల్ పోటీలలో ఆడుతున్న మన తంబళ్లపల్లి కుర్రాడు యూసఫ్ ను హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ ఇండియా తరపున ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నామని, అలాగే నేపాల్ నుండి వచ్చిన తరువాత మహమ్మద్ యూసఫ్ ను ఘనంగా సత్కరిస్తామని తెలియజేసారు. యూసఫ్ మా ప్రాంత వాసి కావడం మాకు గర్వం కూడా ఉందన్నారు. మరిన్ని విజయాలు సాధించి ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## వీఆర్వోలు పనులు చేయకపోతే జీతాలు నిలిపేయండి



**సిద్దవటం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

వీఆర్వోలు పనులు చేయకపోతే వారి జీతాలు నిలిపేయండని కడప ఆర్డీవో జార్విన్ ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలతకు సూచించారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలోని రికార్డు రూంను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ గ్రామ సభలో వచ్చిన అర్జీలు పరిష్కారం ఎన్ని చేశారని అడిగి తెలుసుకుని వీఆర్వోలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఒక్కొక్క వీఆర్వో రోజుకు 4 అర్జీలు పూర్తి చేయించాలని తహసీల్దార్లకు వివరించారు. సమస్యల మీద కార్యాలయానికి వచ్చిన వారి పట్ల దురుసుగా ప్రవర్తించరాదని రెవెన్యూ సిబ్బందికి తెలిపారు. భూ సర్వేలో వచ్చిన 99 అర్జీలను సకాలంలో పూర్తి చేయాలని సచివాలయాల సర్వేయర్లకు తెలిపారు. కొంత మంది సర్వే నెంబర్లు, అనుబంధ పత్రాలపై మాకు ఫిర్యాదులు చేస్తున్నారని వాటిపై సమగ్ర విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామం నుంచి కూడా ఫిర్యాదులు చాలా వస్తున్నాయని సమగ్ర విచారణ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం ఏవో శంకర్‌రావు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత, ఆర్ఎస్సై ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, గ్రామ సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీలలో దువ్వూరు విద్యార్థుల ప్రతిభ



**దువ్వూరు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**

ఈనెల 1, 2వ తేదిలలో జేఎన్‌టీయూ కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్టీఆర్ మెమొరాల్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2025 తైక్వాండో పోటీలలో దువ్వూరుకు చెందిన శ్రీ షిర్డిసాయి హైస్కూల్ విద్యార్థులు 7పథకాలు సాధించినట్లు మాస్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో హరిత రజత పథకాన్ని, సంజీవల హరి కాంస్య పథకాన్ని అలాగే వీరకార్తీక కాంస్య పథకాన్ని, సబ్ జూనియర్ బాలుర విభాగంలో సాయి గిరీష్, హేమంత్‌కుమార్, శివ గోవర్ధన్‌లు కాంస్య పథకాన్ని సాధించారు. అలాగే నవీన్, విజయ్‌కుమార్‌లు 5వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశల కరస్పాండెంట్ లోకేష్, ప్రధానోపాధ్యాయులు మస్తాన్ అలాగే ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి




**మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**

వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అన్నమయ్య జిల్లా డిటిఓ ప్రసాద్ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాలో భాగంగా డిగ్రీ కళాశాల బాలికలతో నిర్వహించిన ర్యాలీని డిటిఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిటిఓ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తమకు సహకరించాలన్నారు. వాహనం నడిపే సమయంలో వారి కుటుంబసభ్యులను గుర్తించుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్‌లు లేకపోవటం, హెల్మెట్ ధరించకపోవటం, సీటు బెల్ట్‌లేకుండా వాహనాలు నడిపే వారిపై భారీగా జరిమాన విధిస్తామన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులు, పోలీసులు నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమై సిటిఎం రోడ్డు, టౌన్‌బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, మల్లికార్జున సర్కిల్ మీదుగా సాగింది. కార్యక్రమంలో ఎంవిఐ ప్రతాప్, దినేష్‌చంద్ర, శివలింగయ్య, శ్రీహరి, ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి పాల్గొన్నారు.

## హంస వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు హంస వాహనం పై కోసువారిపల్లె పురవీధులతోపాటు ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. తొలుత స్వామివారికి టిటిడి ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్, కృష్ణరాజు, రమేష్, ధనుష్ స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆకు పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులు సమర్పించారు. ఊరేగింపు సందర్భంగా స్వామివారు మంగళ వాయిద్యాలు, భక్తుల హరినామ సంకీర్తనల మధ్య అశేష జనవాహిని ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమానికి కోసువారిపల్లె గ్రామంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఎర్రచందనం అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



**చిట్వేలి,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:**

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, పీడీయాక్ట్ చట్టాన్ని ప్రయోగిస్తామని రాజంపేట ఏ ఎస్పి మనోజ్ రామ్ నాథ్ హెగ్డే అన్నారు. బుధవారం చిట్వేలి పోలీస్ స్టేషన్ స్థానిక ఆవరణలో రూరల్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రఘురాంతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఏఎస్‌పి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వారిచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఫిబ్రవరి 4 మంగళవారం తుమ్మ చెట్లపల్లి గ్రామానికి చెందిన తుంగా చరణ్(35), తండ్రి పిచ్చయ్య పొలంలో 12 ఎర్రచందనం దుంగలను గుర్తించామన్నారు. 278 కిలోల బరువు, 4 లక్షల రూపాయల వాటి విలువ ఉంటుందన్నారు. తుంగా చరణ్ తో పాటు ఇందులో సంబంధం ఉన్న రైల్వే కోడూరుకు చెందిన కుంభా వెంకటరమణ (35), కోటకొండ నాగేంద్ర (48) లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ముగ్గురితోపాటు మహీంద్రా ట్రాక్టర్ ఇంజన్, నెంబర్ లేని ట్రైలర్‌ను, ముగ్గురి చరవాణిలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పి తెలిపారు. యువత అడ్డదారులతో నిషిద్ధ పనులు చేసి,తమ విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సిఐ, ఎస్సైలు హితవు పలికారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీక్రిష్ణావతరంలో భక్తులకు దర్శనం

**రామసముద్రం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**



రామసముద్రం మండల కేంద్రంలో వెలసియున్న శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకల్లో భాగంగా రెండవ రోజు ప్రధాన అర్చకులు పార్థసారధి బట్టర్, కులశేఖర్ బటర్‌లు ఉదయం శ్రీవారిని సుప్రభాతసేవతో మేలుకొలుపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి శ్రీరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని చూసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంనగా భజన కార్యక్రమాలు నిర్వహించారు.

## వెల్లటూరులో జర్మన్ బృందం పర్యటన



**పెండ్లిమర్రి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

జర్మన్‌కు చెందిన జాతీయ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధి బృందం బుధవారం జిల్లాలోని పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలనలో భాగంగా ఈనెల 3వ తేదీ నుంచి 7 వరకు చేస్తున్న పర్యటనలో భాగంగా వెల్లటూరులో మెంటార్, ఇంటర్న్ మరియు రైతు హరిప్రియ పొలంలోని ఐజీజీఏఆర్ఎల్ (ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ యొక్క ప్రయోగాత్మక ప్లాట్‌ను సందర్శించారు. విదేశీ బృందానికి చెందిన సంగీత అగర్వాల్, మార్క్ ప్రెయిన్, అన్నా బెరెజోవ్ స్కాజా, సర్వే నాబుయర్స్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. బృంద సభ్యులు హరిప్రియ పొలంలో విత్తన గుళికల విధానాన్ని ఉపయోగించి ప్రయోజనాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు విత్తన గుళికల తయారీ విదానాన్ని డెమో పద్ధతిలో ప్రత్యక్షంగా ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు మురళీధర్, అకాడమీ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ శివారెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, అదనపు డీపీఎం వసంతకుమారి, థిమాటిక్ లీడ్‌లు ప్రకీతి వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్స్‌పై అవగాహణ పెంపొందించుకోవాలి



**ఖాజీపేట, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**

సైబర్ నేరాలు మరియు ఆర్థిక అక్షరాస్యత పట్ల ప్రజలు, విద్యార్థులు అవగాహణ పెంపొందించుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.విజయ నరసింహ పిలుపునిచ్చారు. మోడల్ స్కూల్ నందు రిజర్వ్ బ్యాంక్ వారి సౌసన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, పొదుపు సంఘాల మహిళలు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఫోన్లలో వ్యక్తిగత సమాచారాలు, ఓటీపీలు షేర్ చేయరాదని , సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. రిటైర్డ్ కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ లావా దేవీలు పొదుపు నిర్వహణ డిజిటల్ లావాదేవీలు, ముబైల్స్ వచ్చే లింకు పట్ల జాగ్రత్త వహించాలని, ప్రజలకు ఇలాంటి అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ఎంతగానే ఉపయోపడతాయని తెలిపారు. హెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్, బ్యాంకు లావాదేవీల గురించి మా హెడ్స్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో, అర్బన్ ప్రాంతాల్లో ఈ అవగాహణ విరివిగా ఏర్పాటు చేస్తున్నాం అని, సదస్సులను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్ రూరల్ మీడియా కళాజాత బృందం కళా ప్రదర్శణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీకి కార్యదర్శిని నియమించండి

**దువ్వూరు, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరు గ్రామ పంచాయతీలో పంచాయతీకి కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలల క్రితం జరిగిన బదిలీలలో వ్యక్తిని గ్రామ కార్యదర్శిగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత గ్రామంలో కొన్ని సమస్యలు రావడంతో అవి కోర్టు వరకు వెళ్లడంతో ఆ పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవులో వెళ్లి పోయాడు. ఆయన స్థానంలో ఇంచార్జ్‌గా కానీ, రెగ్యులర్‌గా కాని ఎవరిని నియమించలేదు. 20రోజులుగా పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు విసుగు చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చొరవ తీసుకొని దువ్వూరు గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు.